ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



## ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

కామారెడ్డి/ కంఠేశ్వర్, జూలై 12 : విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద ప్లేట్లు పట్టుకొని నిరసన తెలుపగా, కామారెడ్డిలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. స్కాలర్‌షిప్స్ రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఉపకార వేతనాలను విడుదల చేయడంతో నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి రూ.200 కోట్లు పెండింగ్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. పేదవిద్యార్థులు ఫీజులు చెల్లించలేక తమ సర్టిఫికెట్లను కళాశాలల్లోనే వదిలేసి చదువులకు స్వస్తి చెప్పి, ప్రైవేట్ ఉద్యోగాల వైపు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కామారెడ్డిలో చేపట్టిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్, కార్యదర్శి అజయ్, ఉపాధ్యక్షుడు మణికంఠ, నాయకులు రాహుల్, నితిన్, రాఘవ, ప్రభు, అర్జున్, సాయి, నిజామాబాద్‌లో ధర్నా నిర్వహించిన అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకోండ విఘ్నేశ్, సహాయ కార్యదర్శి దీపిక, నాయకులు విశాల్, సతీశ్, రాజు, ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.



- సమస్యల్లో సర్కారు బడులు
- పునాదుల వద్దే నిలిచిన లింగాపూర్ పాఠశాల నిర్మాణ పనులు
- జీపీలో కొనసాగుతున్న విద్యా బోధన



కొల్లూర్ గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న పాఠశాల

## పంచాయతీలోనే పాఠశాల

కోటగిరి, జూలై 12 : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే ఉద్దేశంతో చేపట్టిన అమ్మ ఆదర్శ పథకం పనులు నత్తకు నడక నేర్పేలా ఉన్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఉమ్మడి కోటగిరి మండల వ్యాప్తంగా 16, పోతంగల్ మండలంలో 17 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటిలో తాగునీరు, శౌచాలయాలు, తరగతి గదుల నిర్మాణం,ప్రహరీ నిర్మాణాలు వంటి ప్రధాన పనులు చేపట్టాల్సి ఉన్నది. ఎంపిక చేసిన పాఠశాలల్లో పనులన్నింటినీ జూన్ 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా పనులు కొనసాగుతున్నాయి.

### అర్ధాంతరంగా నిలిచిన పాఠశాల భవన నిర్మాణం..

ఉమ్మడి మండలంలోని కొల్లూర్ గ్రామంలో అర్ధాంతరంగా పాఠశాల భవన నిర్మాణం నిలిచిపోయింది. కొల్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతులు ఉండగా, అందులో 14 మంది విద్యార్థులు, ఉపాధ్యాయిని ఉన్నారు. కొల్లూర్‌లోని ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరుకాగా గుత్తేదారుకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేశారు. గతేడాది స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో తరగతులు నిర్వహించి అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ భవనంలో ఇరుకైన గదిలోనే కొనసాగిస్తున్నారు.

### పునాదులకే పరిమితం..

కోటగిరి మండలం లింగాపూర్ గ్రామంలో పునాదులకే పరిమితమైంది పాఠశాల భవనం. లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండగా ఇందులో 16 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. పనులు మాత్రం పునాదులకే పరిమితమయ్యాయి. గత ఏడాది గ్రామ పంచాయతీ భవనంలో తరగతులు నిర్వహించారు. ఈ ఏడాది కూడా గ్రామ పంచాయతీలోనే చదువులు కొనసాగుతున్నాయి. ఈ బడికి అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యానికి రూ. 3 లక్షలు మంజూరయ్యాయి. భవనం లేకపోవడంతో ఆ పనులు సైతం నిలిచిపోయాయి.



లింగాపూర్‌లో పునాదులకు పరిమితమైన పాఠశాల భవనం



కొల్లూర్‌లో అర్ధాంతరంగా నిలిచిన పాఠశాల భవన నిర్మాణం

### సొంత భవనాలు లేకనే పనులు చేపట్టలేదు..

లింగాపూర్, కొల్లూర్ గ్రామాల్లో పాఠశాలకు సొంత భవనాలు లేకపోవడంతో అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన నిధులతో అక్కడ పనులు చేపట్టలేక నిలిపివేశాం. ఈ రెండు గ్రామాల్లో పాఠశాల భవన నిర్మాణ పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో గ్రామ పంచాయతీలోనే విద్యాబోధన కొనసాగుతున్నది.

-మనోహర్‌రెడ్డి, ఎంపీడీవో, కోటగిరి



## డుమ్మా డాక్టర్లపై చర్యలు

### డీఎంహెచ్‌వోకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశం

బోధన్, జూలై 12: ప్రభుత్వ దవాఖానల్లో విధులకు హాజరుకాని వైద్యులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలుచేయాలని జిల్లా వైద్యాధికారికి ఆదేశాలు జారీ చేశారు. వర్నిలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. ప్రతి శుక్రవారం నిర్వహించే ఆరోగ్యమేళాలో మధుమేహం, రక్త పరీక్షలు నిర్వహిస్తున్న తీరుపై వైద్యసిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యసిబ్బంది హాజరుపట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా దవాఖానకు వైద్యులు సక్రమంగా రావడంలేదని కొందరు ఫిర్యాదుచేయగా ..దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలపై రోగులు, ప్రజల్లో నమ్మకం పెంచాలని వైద్య సిబ్బందికి సూచించారు.

### ఉన్నత పాఠశాలల తనిఖీ

వర్నిలోని సత్యనారాయణపురం బాలికల జడ్పీ హైస్కూల్, మండలంలోని శ్రీనగర్ జడ్పీ హైస్కూల్ కలెక్టర్ సందర్శించి అక్కడ కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో దుర్గాప్రసాద్, అధికారులు ఉన్నారు.



వర్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

## లైంగిక వేధింపుల కేసులో హెచ్‌ఎం సస్పెన్షన్

బాన్సువాడ రూరల్, జూలై 12: విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్న ఆరోపణల నేపథ్యంలో మండలంలోని దేశాయిపేట్ హైస్కూల్ హెడ్మాస్టర్‌పై అధికారులు వేటు వేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన అతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. దీంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అతడిని డీఈవో రాజు సస్పెండ్ చేసినట్లు బాన్సువాడ ఎంఈవో నాగేశ్వర్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.



నీరులేక వెలవెలబోతున్న పోచారం ప్రాజెక్టు

- బోసిపోయిన ప్రాజెక్టు..
- జాడలేని వర్షాలు
- ఆకాశం వైపు చూస్తున్న అన్నదాతలు
- ప్రశ్నార్థకంగా మారిన ఆయకట్టు భవితవ్యం

## అడుగంటిన పోచారం

### ఆందోళనలో రైతాంగం

నాగిరెడ్డిపేట, జూలై12: వేలాది ఎకరాలకు ఆయువుపట్టు అయిన పోచారం అడుగంటింది. వర్షాలు కురియక, చుక్కనీరు రాక బోసిపోయింది. ఓవైపు, కాలం కరిగిపోతుంటే చినుకు జాడ లేక రైతాంగం ఆందోళన చెందుతున్నది. నల్లటి మబ్బులతో కమ్ముకొస్తున్న ఆకాశం వైపు ఆశగా చూస్తున్నది. వానల్లేక, ప్రాజెక్టులో నీళ్లు లేక బోర్లు వట్టిపోతున్నాయి. దీంతో నారు పోసుకునే పరిస్థితి లేదు. ఇప్పటికే పోసిన నార్లను సంరక్షించుకునే పరిస్థితి లేదు. పోసుకున్న పరిస్థితీ లేదు. కాలం ఇలాగే ఉంటే రైతుల బతకులు ఆగమే. నలుగురికి అన్నంపెట్టే రైతు బతుకుదెరువు కోసం తిరిగి వలసపోయే పరిస్థితి వస్తుందని పోచారం ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల రైతులకు సాగు, తాగునీరు అందిస్తున్న వరప్రదాయిని.. అన్నం పెట్టే అన్నపూర్ణ అని ఈ ప్రాంత ప్రజలు ఇష్టంగా పిలుచుకొంటారు. అలాంటి ప్రాజెక్టు నేడు చుక్క నీరు లేకుండా బోసిపోతున్నది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1464 ఎంసీఎఫ్‌టీలు (1.83 టీఎంసీలు (ప్రధాన కాలువ వద్ద 20.6 అడుగులు)) కాగా ప్రస్తుతం జీరో లెవల్‌కు పడిపోయింది.



ప్రధాన కాలువకు నీరు వదిలే గేట్ల వద్ద చుక్క నీరులేని దృశ్యం

### 30 వేల ఎకరాలకు ఆయువుపట్టు..

పోచారం ప్రాజెక్టు ప్రధాన కాలువ ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల్లో 53 కిలోమీటర్లు విస్తరించి ఉంది. 73 ప్రధాన డిస్ట్రిబ్యూటర్లతో పాటు మరో పది చిన్న డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. అధికారికంగా 13 వేల ఎకరాలు నీరందుతున్నా, వాస్తవంగా 30 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.

### వట్టిపోతున్న బోరుబావులు..

వర్షాలు లేక ప్రాజెక్టు అడుగంటిపోవడంతో నాగిరెడ్డిపేట, లింగంపేట మండలాల్లోని ఆయకట్టు కింద పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. అలాగే మెదక్ జిల్లాలోని ఘన్‌పూర్ మండలం, రాజంపేట, తాడ్వాయి మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోతున్నాయి. తొలకరి వర్షాలకు కోటి ఆశలతో అప్పులు చేసి వేసుకున్న పంటలు వరుణుడు ముఖం చాటేయడం, బోర్లు ఎత్తిపోతుండడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### డెడ్‌స్టోరేజ్‌కు పోచారం..



పోచారం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1464 ఎంసీఎఫ్‌టీలు (1.82 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం డెడ్ స్టోరేజ్‌కి చేరింది. గతేడాది ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో..రైతులు ముందస్తుగా పంటలు వేసుకున్నారు. ఈసారి పరిస్థితి దారుణంగా ఉన్నది. ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి కొత్తనీరు చేరలేదు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండితే ఆయకట్టు రైతులకు రెండు పంటలకు నీరు అందుతుంది. ప్రతిసారి ప్రాజెక్టు ఆగస్టు నెలాఖరులోపు పూర్తి స్థాయిలో నిండుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు పంటలు వేసే విషయంపై ఆలోచించాలి.

- వెంకటేశ్వర్లు,
డీఈఈ, నీటి పారుదల శాఖ

### రైతు బతుకులు ఆగమే..



ప్రాజెక్టు నిండకపోతే మా రైతుల బతుకులు ఆగమవుతాయి. మా గ్రామ శివారు మొత్తం ప్రాజెక్టులో పోవడంతో..ప్రాజెక్టు పైభాగాన భూములు ఉన్నాయి. బోరుబావుల ఆధారంగా పంటలు సాగు చేసుకుంటున్నాం. ప్రాజెక్టులో 15 అడుగుల నీరు ఉంటేనే బోర్ల నుంచి నీళ్లు వస్తాయి. లేకపోతే వట్టిపోతాయి. ప్రస్తుతం గ్రామంలోని 70 శాతం మంది రైతులందరం బోరుబావుల కింద పంటలు వరి పంటలు వేసుకున్నాం. ప్రాజెక్టులో ఇప్పటివరకు నీరు రాకపోవడంతో బోర్లలో నీళ్లు తగ్గి ఎత్తిపోతున్నాయి.

- కలాలి సత్యాగౌడ్,
రైతు, పోచారం గ్రామం



## శోభాయమానంగా.. జగన్నాథ రథయాత్ర

- హరే రామ..హరే కృష్ణ.. నామస్మరణతో మార్మోగిన ఇందూరు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

సుభాష్‌నగర్, జూలై 12: జిల్లా కేంద్రంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నీల కంఠేశ్వరాలయం నుంచి రథయాత్రను ప్రారంభించి.. ప్రధానమార్గాల గుండా వినాయక్‌నగర్‌లోని విజయలక్ష్మీ గార్డెన్స్ వరకు కొనసాగింది. ప్రత్యేక పూజల అనంతరం మహా హారతి, ప్రసాద వితరణ చేశారు. శోభాయాత్రలో మహిళలు, భక్తులు నృత్యాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నగర పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటుచేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇస్కాన్ అబిడ్స్ అధ్యక్షుడు వేదాంత చైతన్య దాస్ ప్రభు హాజరై భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.



జిల్లాకేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం వద్ద రథయాత్రలో పాల్గొన్న భక్తులు, రథంపై దేవతామూర్తులు (ఇన్‌సెట్‌లో)